# నగరానికి రూ.200 కోట్లు కేటాయించాలి

- పింఛన్లు వెంటనే విడుదల చేయాలి
- కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 15: పదేండ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగాలంటే రాష్ట్ర బడ్జెట్‌లో కరీంనగర్‌కు రూ. 200 కోట్లు కేటాయించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక ఎస్బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూలేనివిధంగా కేసీఆర్ సర్కారు నగరాభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో నే నగరానికి స్మార్ట్‌సిటీ హోదా వచ్చిందన్నారు. రూ. 550 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులతో నగర రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. ప్రస్తుత సర్కారు కూడా కేంద్రం ఇచ్చే నిధులకు సమానంగా నిధులు విడుదల చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించిన ఓటర్లందరికి కృతజ్ఞతలు తెలిపారు. పదేండ్ల మాదిరిగానే నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు డిసెంబర్ నెలలో పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరంలో ఇంకా శివారు డివిజన్లు, కాలనీల్లో అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, వాల రమణ రావు, నాంపెల్లి శ్రీనివాస్, కుర్ర తిరుపతి, తోట రాములు, నాయకులు కొండపల్లి సతీష్, శ్రీనివాస్, సాగర్ ఉన్నారు.

## రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలి

కలెక్టరేట్, డిసెంబర్ 15 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి బరిలో నిలువనున్న బోయినపల్లి వినోద్‌కుమార్ విజయానికి విదేశాల్లో ఉన్న ప్రతి ముస్లిం కృషి చేయాలని, ఎంఐఎం నగరాధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. విదేశీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన ఖతార్ దేశానికి చేరుకోగా, గోల్డెన్ తెలంగాణ ఎన్నార్ఐ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో వారినుద్దేశించి మాట్లాడుతూ, శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్‌ను గెలిపించుకున్నట్లుగానే, ఎంపీగా వినోద్‌కుమార్‌ను విజయతీరాలకు తీసుకెళ్లేందుకు సహకరించాలని కోరారు. గతంలో పార్లమెంటు సభ్యుడిగా పనిచేసిన ఆయన కరీంనగర్ జిల్లాభివృద్ధి కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. మరోసారి ఎంపీగా గెలిపించుకుంటేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ దిశగా సబ్బండ వర్గాల ప్రజలు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. పాలస్తీనాకు మద్దతుగా జరిగిన జుమా నమాజ్ అనంతరం ఖతార్‌లోని ఓ మసీద్ వద్ద జరిగిన ఆందోళనలో గులాం అహ్మద్ పాల్గొన్నారు. ఇక్కడ గోల్డెన్ తెలంగాణ ఎన్ఆర్ఐ వెల్ఫేర్ అసోసియేషన్ ఖతార్ అధ్యక్షుడు మహ్మద్ యావర్ హుస్సేన్, సభ్యుడు సయ్యద్ ఇర్ఫాన్ ఉన్నారు.

## అల్ఫోర్స్‌లో చండీ యాగం

కార్పొరేషన్, డిసెంబర్ 15: అమ్మవారి పూజ, ఆరాధన సమాజంలో శాంతిని పెంపొందిస్తుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వీ నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వావిలాలపల్లిలోని విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో రుత్విక్కులతో కలిసి ఏర్పాటు చేసిన మహారుద్రసహిత సహస్ర చండీ మహాయాగ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థల్లో ప్రతి ఏటా చండీమాతను గొప్పగా ఆరాధిస్తున్నామని తెలిపారు. ఈ నెల 18 నుంచి 22 వరకు దేశరాజుపల్లిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థలో 100 మంది రుత్విక్కులతో వైభవోపేతంగా వేద మంత్రాల మధ్య ఈ క్రతువు నిర్వహిస్తామన్నారు. యాగం నిర్వహించడానికి అన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ యాగాన్ని చాలా గొప్పగా వేద బ్రాహ్మణుల మార్గదర్శకంలో అపూర్వంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు వైదిక కార్యక్రమాలు సాగుతాయన్నారు. ఈ నెల 19న సాయంత్రం శివపార్వతుల కల్యాణ మహోత్సవం, 20న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం, 22న మహాపూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం అమ్మవారి తీర్థ ప్రసాదం, భోజనాలు ఉంటాయన్నారు. భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## 17న జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు

కొత్తపల్లి, డిసెంబర్ 15 : జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలను ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మానేరు నది ఆనకట్టపై ఈ ఎంపిక పోటీలను నిర్వహిస్తారన్నారు. అండర్–16, 18, 20 బాల బాలికలు, పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 17న ఉదయం 6 గంటలకు పోటీలు జరిగే ప్రాంతంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

## దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

**జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ**



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

కలెక్టరేట్, డిసెంబర్ 15 : అంగవైకల్యంతో మనుగడ సాగిస్తున్న దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల పాఠశాలల్లో అందిస్తున్న బోధన, శిక్షణ, సిబ్బంది సేవా తత్పరత అమోఘమని కొనియాడారు. దివ్యాంగుల కోసం గతంలో ఎలాంటి ఉపకరణాలు ఉండేవి కావని, ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంతో అనేక ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, దివ్యాంగులకు నిర్వహించిన ఆటలు, క్రీడల పోటీలు వారిలోని ప్రతిభను వెలికితీస్తాయన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈపోటీల్లో పాల్గొన్న దివ్యాంగుల ఉత్సాహం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. ప్రపంచంలో ఎందరో దివ్యాంగులు ఎన్నో అద్భుతాలు సాధించారని గుర్తు చేశారు. అందులో శాస్త్రవేత్తలు, కవులు కూడా ఉన్నారని తెలిపారు. లూయీ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్, సూరదాస్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు ఎన్‌జీవోల సహకారంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, సదరం సర్టిఫికెట్ల కోసం మెడికల్ స్లాట్ బుకింగ్‌లో తలెత్తే సమస్యలపై రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగుల నృత్య ప్రదర్శనలు, గేయాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం పలు రంగాల్లో సేవలందించిన దివ్యాంగులను సత్కరించారు. ఆటలు, క్రీడల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, డీఆర్‌డీవో శ్రీలత, మెప్మా పీడీ రవీందర్, డీఎంహెచ్‌వో లలితాదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సీడీపీవో సబిత, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత అంజనారెడ్డి, ప్రిన్సిపాల్ నర్మద, బీటి రామారావు, నాగలక్ష్మి, రోజా, పరమేశ్వర్, ఉమారాణి, దివ్యాంగుల సంక్షేమ సంఘాల బాధ్యులు జక్కం సంపత్, కట్ట రవీందర్, కైరి అంజయ్య, వెన్నం శ్రీనివాస్, కొలకాని నర్సయ్య, కొత్తూరి స్వామి, సాధు మునీందర్ రెడ్డి, దివ్యాంగులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

- డీఆర్డీఏ పీడీ శ్రీలతారెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలతారెడ్డి

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 15: గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధిహామీ పనులు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీలతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై 13వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఆర్పీ ప్రకారం రికార్డులు నిర్వహించకపోవడంపై ఉపాధిహామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండిపోయిన మొక్కల ప్రదేశంలో కొత్త మొక్కలు నాటించాలని సూచించారు. క్రీడా ప్రాంగణం నిర్మాణంలో జరిగిన అవకతవకల్లో గ్రామపంచాయతీలకు రికవరీ పెట్టారు. ఇక్కడ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, డీఆర్‌డీఏ ఏపీడీ సంధ్యారాణి, విజిలెన్స్ ఏవీవో వెంకటేశ్వర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కళావతి, ఎంపీవో శోభారాణి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీపీ జగన్ మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, డీఆర్పీ సతీశ్, రాకేశ్, నవీన్, శైలజ, సంధ్య, శ్రీకాంత్, గౌతమి, రమ్య, పులేందర్, కృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ టెక్నీషియన్స్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

గంగాధర, డిసెంబర్ 15 : ఉప్పరమల్యాల ప్రభుత్వ పాఠశాలలో రామడుగు, గంగాధర మండలాలకు చెందిన ఇంగ్లిష్ మీడియం కాంప్లెక్స్ మీటింగ్, గంగాధర ప్రభుత్వ పాఠశాలలో రామడుగు, గంగాధర మండలాలకు చెందిన హిందీ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. శుక్రవారం ఎంఈవో అంబటి వేణుకుమార్ సందర్శించారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు ప్రభావతి, మల్లికార్జున్, ఉపాధ్యాయులు ఇర్షాద్, సంపత్‌రెడ్డి, అల్లావుద్దీన్, హరిశంకర్, సుమలత, దీపక్, రమేశ్, నాగరాజు ఉన్నారు.

## సీఎండీని కలిసిన టీఆర్వీకేఎస్ నాయకులు

ముకరంపుర, డిసెంబర్ 15: ఎన్పీడీసీఎల్ సీఎండీగా నియమితులైన కర్నాటి వరుణ్ రెడ్డిని శుక్రవారం వరంగల్‌లోని కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం(టీఆర్వీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, కార్యదర్శి కోడూరి ప్రకాశ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇక్కడ నాయకులు అజీజ్, ప్రభాకర్ ఉన్నారు.

## బ్యుటీషియన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్, డిసెంబర్ 15: నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న బ్యుటీషియన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 16 నుంచి 20 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి 2 నాటికి 18 ఏండ్లు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని వెల్లడించారు. ఇతర వివరాలకు కళాశాలలోని కోర్సు సమన్వయకర్తను సంప్రదించాలని కోరారు.

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 15: నగరంలోని ఆర్టీసీ సమీపంలోని 13 ఎకరాల భూమిలో కొంత మంది నాయకులు కబ్జాకు పాల్పడుతున్నారని వారి పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం నగరం కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 13 ఎకరాలు ప్రభుత్వ శిఖం భూమిగా ఉందన్నారు. కొందరు భూ మాఫియాదారులు ఇప్పటి వరకు 5 ఎకరాలను కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జా చేసిన స్థలంలో నిర్మించిన భవనాలను కూల్చి వేసి, అక్రమదారుల మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

గంగాధర, డిసెంబర్ 15 : విధుల్లో నిర్లక్ష్యం వహించిన విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ విద్యుత్ శాఖ రూరల్ డీఈ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం గంగాధర మండలం కురిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కోసం లైన్ మన్ అంజయ్య ఫోన్‌లో గంగాధర సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ లక్ష్మీనారాయణను లోడ్ రిలీఫ్(ఎల్సీ)ని కోరాడు. ఆపరేటర్ రెండు ఫీడర్లకు ఎల్సీ ఇవ్వడంతో లైన్‌మన్ దేశాయ్, అన్‌మ్యాన్ సురేశ్ గాయపడ్డారు. ఈ ఘటనపై విచారణ చేసిన ఉన్నతాధికారులు ఆపరేటర్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేసినట్లు ఏఈ తిరుపతి తెలిపారు.

## పొట్టిశ్రీరాములు ఆశయాలను కొనసాగించాలి

తెలంగాణచౌక్, డిసెంబర్15: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని మార్కెట్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, మల్లికార్జున్, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు రాచమల్ల ఆంజనేయులు, వంగల పవన్, మహిళా విభాగం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాధాకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 15: నగరంలోని 33/11కేవీ ఉజ్వల పార్కు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ సుధీర్ శుక్రవారం కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలకాపురి, ఎన్టీఆర్ విగ్రహం ప్రాంతం, కోతిరాంపూర్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, దోబివాడ, కట్టరాంపూర్ ఏరియా, తిరుమల్‌నగర్, వినాయక నగర్, శ్రీనివాసనగర్, గౌతమీనగర్ ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## నలుగురు బీజేపీ నేతలకు సెన్సార్ బోర్డులో చోటు

విద్యానగర్, డిసెంబర్ 15: కేంద్ర సెన్సార్ బోర్డులో కరీంనగర్ జిల్లాకు చెందిన బీజేపీ నేతలకు చోటు కల్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ రంగు భాస్కరాచారి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్‌చంద్ర, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి బండారి గాయత్రి, సీనియర్ నాయకుడు లడ్డు ముందడా బోర్డు మెంబర్లుగా నియమితులైనట్లు సంబంధిత అధికారులు వారికి సమాచారం అందించారు. సెన్సార్ బోర్డు మెంబర్లుగా అవకాశం కల్పించిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం

చొప్పదండి, డిసెంబర్ 15: చొప్పదండి శ్రీ వేంకటేశ్వర మణికంఠ దేవాలయ అభివృద్ధికి పట్టణంలోని గుర్రం జయప్రద–మల్లారెడ్డి దంపతులు రూ. 10,116 విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వెంకటేశ్ గౌడ్ మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించి హరిహరపుత్రుడి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కార్యదర్శి ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, బత్తిని ప్రశాంత్ ఉన్నారు.